క్లుప్తంగా

వైద్య శిబిరం విజయవంతం


కంటి వైద్య శిబిరంలో సీపీఎం నేత నర్సింహ

యాచారం: మండలంలోని చింతుల్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో పాషా, నరహరి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో శంకర్ కంటి ఆస్పత్రి వైద్య బృందం శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని 200 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు వినోద్‌కుమార్, వెంకటేశ్, భూషన్, బుగ్గరాములు, జంగయ్య, రవి, యాదయ్య, రాజయ్య పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ రమేష్ తదితరులు

మంచాల: ప్రతి ఒక్క ఓటరు ఈవీఎం మిషన్ల వాడకం గురించి తెలుసుకోవాలని మంచాల ఆర్ఐ రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవీఎంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికల్లో ఈవీఎంను ఉపయోగిస్తారని తెలిపారు. ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) ఎలా పని చేస్తుందని ప్రజలకు వివరించారు. ప్రతి ఓటరు ఈవీఎం మిషన్లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు వేయవచ్చన్నారు. కార్యక్రమంలో మంచాల సర్పంచ్ జగన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు బాలరాజు, రెవెన్యూ ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజ్, మంచాల బూత్‌స్థాయి అధికారులు యాదమ్మ, వరలక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

గోలి శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం


గోలి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం మాడ్గుల మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు రాజు, రమేష్, వెంకటయ్య, మల్లేష్, శ్రీను, రాజు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం ఎన్నడో?

- ఆమనగల్లులో ట్రాఫిక్ ఇబ్బందులు
- రాజీవ్ చౌరస్తాలో ప్రమాదకరంగా ప్రయాణం
- అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్


ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్‌సిగ్నల్స్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఏడాది క్రితం ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసినా ప్రారంభానికి నోడుకోవడ లేదు. జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. పాలకులు, అధికారుల ఉదాసీనత ప్రయాణికులకు శాపంగా మారింది.

పెరిగిన ట్రాఫిక్

పట్టణంలో ట్రాఫిక్ పెరిగిపోయింది. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి ఆమనగల్లు పట్టణం మీదుగా ఉండటంతో ప్రతినిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోజురోజుకు పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ముఖ్యంగా రాజీవ్ చౌరస్తా వద్ద తరచూ ట్రాఫిక్‌తో వాహనాలు నిలిచిపోతున్నాయి.

మితిమీరిన వేగం

జాతీయ రహదారి కావడంతో వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తున్నాయి. పట్టణంలోని పోస్టాఫీసు నుంచి రాజీవ్ చౌరస్తా వరకు మితిమీరిన వేగంతో వాహనాలు రావడంతో చౌరస్తా వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై డివైడర్ ఏర్పాటు చేయడంతో వాహనాలు యూటర్న్ తీసుకోవడానికి చాలా దూరం వెళ్తున్నాయి. దీనితో రాజీవ్ చౌరస్తా వద్ద వాహనాలు యూటర్న్ తీసుకునే వీలుండటంతో చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఏర్పాడుతోంది. ఇక్కడినుంచే ప్రజలు కూడా రోడ్డు దాటాల్సివస్తుంది.

అడ్డగోలు పార్కింగ్

జాతీయ రహదారిపై వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. పట్టణంలోని దుకాణాల ఎదుట వీధి వ్యాపారులు బండ్లు ఏర్పాటు చేసుకోవడంతో ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే ఆపుతున్నారు. దీనితో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. గతంలో రోడ్డుపై వాహనాలు నిలపకుండా పోలీసులు చూసేవారు. ఇటీవల పోలీసులు కూడా పట్టించుకోకపోవడంతో రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలుపుతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి, ప్రమాదాల నివారణకు ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. సిగ్నల్స్ ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్నా నేటికి ప్రారంభించలేదు. షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ఆమనగల్లు పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు వస్తూ ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బంది ఆమనగల్లుకు రావడానికి అయిష్టత చూపుతున్నారని తెలుస్తోంది. దీనితో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించడం లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించి ఇబ్బందులు నివారించాలని కోరుతున్నారు.

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కొత్తూరు: ఓ అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదుతో కొత్తూరు తహసీల్దార్ జానకి తమ పొలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేసిందని పెంజర్ల గ్రామానికి చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పొలానికి సంబంధించిన పట్టాతో పొలాన్ని విక్రయించడానికి ఇతరులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. సదరు కొనుగోలు దారుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం మంగళవారం ఉదయం స్లాట్ బుకింగ్ చేసినట్లు వివరించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా ఎవరో ఒకవ్యక్తి వచ్చి తమ పొలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆ ప్రక్రియను ఆపేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆ వ్యక్తి సూచనతో తహసీల్దార్ పూర్తి వివరాలు, పత్రాలను సరిచూసుకోకుండానే సదరు వ్యక్తి చెప్పినట్లు తమ రిజిస్ట్రేషన్ ఆపివేయడం బాధాకరమన్నారు. రిజిస్ట్రేషన్‌కోసం తాము కుటుంబ సభ్యులతో వేచి చూస్తున్నప్పటికీ తహసీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లిపోయినట్లు బాధిత రైతులు ఆరోపించారు. ఈ విషయాన్ని రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయం గురించి తహసీల్దార్ జానకిని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

ఇబ్రహీంపట్నం: గుర్తింపు ఉన్న రాజకీయ పక్షాల ప్రతినిధులతో బుధవారం ఉ.11 గంటలకు ఇబ్రహీంపట్నంలోని కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ అనంతరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికలు, ఓటర్ల జాబితా తదితర అంశాలపై చర్చించనున్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు


పూజల్లో పాల్గొన్న పత్యానాయక్, నాయకులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లిలో మంగళవారం సాయంత్రం ఎల్లమ్మతల్లి బోనాల పండుగ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, స్థానిక నాయకులు రాములు, ఆంజనేయులు యాదవ్, పరమేశ్‌గౌడ్, రమేశ్‌నాయక్, జంతుకరాములు, అల్లాజీ, జంగయ్య, శ్రీశైలం, కృష్ణయ్య, వెంకటయ్య, పర్వతాలు, గణేశ్, గిరి, ఎల్లయ్య, అల్లాజీ పాల్గొన్నారు.

జర మా గోడు ఆలకించండి


వర్షం నీటిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: జర మా గోడు ఆలకించండి సార్ అంటూ జేఏసీ నాయకులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలోని గట్టుఇప్పలిపల్లిని మండలముగా చేయాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 65వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. దీక్షలు, ధర్నాలు చేస్తున్నా మా గోసా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దూరంగా ఉన్న తలకొండపల్లి మండల కేంద్రానికి వెళ్లి ప్రతి రోజు పనులు చేసుకోవాలంటే ప్రజలు నానా కష్టాలు పడుతున్నారని వాపోయారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా గట్టుఇప్పలపల్లిని మండలముగా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దామోదర్, రేణురెడ్డి, చంద్రయ్య, వెంకటేష్, శివయ్య, ఈదమయ్య, కృష్ణయ్య, లింగయ్య, శ్రీను, దాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు అండగా..


చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థిని ఉన్నత చదువుకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు అండగా నిలిచింది. ఆమనగల్లు పట్టణానికి చెందిన రవి, లక్ష్మి దంపతుల కుమార్తె హర్షిణి ఉన్నత చదువులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో పట్టణానికి చెందిన నాగిళ్ళ జగన్ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ దృష్టికి తీసుకువెళ్లాడు. హర్షిణి ఉన్నత చదువుకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చాడు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విద్యార్థిని హర్షిణికి రూ.10 వేలు చెక్కును వెంకటేశ్ అందజేశారు. కార్యక్రమంలో తలకొండపల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోపాల్‌నాయక్, నాయకులు శ్రీశైలంగౌడ్, జగన్ పాల్గొన్నారు.

తండావాసుల తండ్లాట


అలుగు పారుతున్న గుర్లకుంట చెరువు

నిలిచిన పనులతో అవస్థలు


మక్తమాధారం- పెద్దారెడ్డిచెరువు రహదారి బురదమయం

కడ్తాల్: మండలంలోని ఆయా గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక గుర్లకుంట చెరువు నిండి అలుగు పారుతోంది. దీంతో గుర్లకుంట తండా ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత ఏడాది చివరలో కడ్తాల్ నుంచి గుర్లకుంట తండా వరకు, బీటీ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులు రూ.1 కోటి ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో జనవరి మాసంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పనులు ప్రారంభించిన గుత్తేదారు, తండాకు వెళ్లే నిర్మాణ పనులను వేగవంతంగా చేయకపోవడంతో నేటికి బీటీ పనులు పూర్తి కాలేదు. కేవలం రోడ్డుకు ఇరువైపులా షోల్డర్ వర్క్ పూర్తి చేసి వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తండాకు వెళ్లే దారి పూర్తిగా నిండి రాకపోకలు ఇబ్బందిగా మారింది. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన నాటి నుంచి సకాలంలో పనులు చేసి ఉంటే, రహదారి మీదుగా రాకపోకలు సాఫీగా సాగేవని తండావాసులు వాపోతున్నారు. అలాగే, మక్తమాధారం–పెద్దారెడ్డి చెరువుతండా రోడ్డు అధ్వానంగా మారింది. గోతుల్లో నీరునిలిచి, బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా తయారయింది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్


మాసబ్ చెరువు కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్

తుర్కయంజాల్ : ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని పలు లోతట్టు, ప్రాంతాలు, చెరువులు, కాల్వలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే మున్సిపల్ కార్యాలయంలోని కంట్రోల్ రూం ఫోన్ నంబర్లను 9550438213, 9966995842 సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్త

యాచారం: ఎడతెరిపి లేని వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తాగునీటి పైపులు లీకేజీలు కాకుండా, ప్రజలకు కలుషితమైన నీరు సరఫరా కాకుండా, డ్రైనేజీ కాల్వలు నిండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షాల వల్ల పంటలు దెబ్బతింటే వెంటనే సర్వే చేసి నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని వ్యవసాయాధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే ఉండాలని తెలిపారు.

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు


స్టడి మెటీరియల్‌ను అందజేసిన వెంకటరమణారెడ్డి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఎంకేఆర్ ఫౌండేషన్ వేలాది మంది నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తయారు చేయించిన టెట్, డీఎస్సీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అభ్యర్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఎంకేఆర్ ఫౌండేషన్ స్థాపించి ఉచిత శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఎనిమిదేళ్ల కాలంలో ఫౌండేషన్ ద్వారా 4984 మంది ఉచిత శిక్షణ పొందగా అందులో 1094 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న టెట్, డీఎస్సీల్లో ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు అత్యధిక శాతం సక్సెస్ సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి జెర్కోని రాజు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ కార్యదర్శి రాజ్‌కుమార్, అధ్యాపకులు నాగేశ్వర్‌రావు, ఫౌండేషన్ సభ్యులు కరుణాకర్, శ్రవణ్, నాని, జైపాల్, మహేశ్‌లు పాల్గొన్నారు.

ఆచార్య దేవోభవ


అరుణ(హిందీ, ఎస్ఏ)ఆరుట్ల


రవీందర్ ముదిరాజ్ (ఎంపీపీఎస్)ఆరుట్ల


శ్రీకాంత్ (ఎంపీయూపీఎస్)బండలేమూర్


ఎస్.సుగంధ (ఎంపీపీయస్) ఆరుట్ల


కడ్తాల్: కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

టీచర్స్ డే సందర్భంగా మంగళవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు, ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, ఉపాధ్యాయులు సమాజ మార్గ నిర్దేశకులని కొనియాడారు. తల్లిదండ్రుల తరువాత గురువులే విద్యార్థుల బాధ్యత తీసుకుంటారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులకు మంత్రి సబితారెడ్డి అవార్డులు ప్రదానం చేశారు. –సాక్షి నెట్‌వర్క్


కడ్తాల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


ఆమనగల్లు: అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయిని లీలావతి


కడ్తాల్: ఉత్తమ ఉపాధ్యాయిని ఇందిరకు అవార్డు అందజేస్తున్న మంత్రి సబిత


హైదరాబాద్‌లో మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాసులు


మంత్రిచే అవార్డు అందుకుంటున్న జేర్మియా


ఆమనగల్లు: ఉపాధ్యాయులను సత్కరించిన ప్రజాప్రతినిధులు


కడ్తాల్: ఉపాధ్యాయులను సన్మానించిన పాఠశాల యాజమాన్యం

ఆశవర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని వినతి


మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు, నేతలు

ఇబ్రహీంపట్నం: ఆశవర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు మంగళవారం ఇబ్రహీంపట్నం దండుమైలారం మెడికల్ ఆఫీసర్ పూర్ణంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాల నుంచి పని చేస్తున్న ఆశవర్కర్లకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.18 వేలు ఆశలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెయ్యి రూపాయల చొప్పున 16 నెలల బకాయిపడ్డా కోవిడ్ రిస్క్ అలవెన్స్, 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు రావాల్సిన 6 నెలల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశలకు పనిభారం తగ్గించి, జాబు చాట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 11వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు యాదగిరి, ఆశవర్కర్లు సుకన్య, మణెమ్మ, భాగ్యక్ష్మి, లలిత, లావణ్య, నాగమణి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు ధర్నా

యాచారం: సీఎం కేసీఆర్ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆశవర్కర్లు యాచారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. నెలకు రూ.18 వేల వేతనం, టీబీ టెప్రసి, కంటి వెలుగు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, 2021 జూలై నుంచి రావాల్సిన పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రసూతి సెలవులపై సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఆశవర్కర్లకు మద్దతుగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, మండల కార్యదర్శి చందునాయక్‌లు పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్యాధికారి రాజ్యలక్ష్మికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు స్వరూప, శోభరాణి, పద్మ, స్వాతి, నాగమణి, లక్ష్మమ్మ, బాలమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంచాల, ఆరుట్లలో నిరసన

మంచాల: ఆశ వర్కర్ల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మంచాల, ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు పని భారం పెరిగిందన్నారు. కనీస వేతనం నెలకు రూ.18వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. హెల్త్‌కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు అమృత, నవనీత, సంతోష, ఆలివేలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


వైద్యాధికారి రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఆశలు


మంచాల: నిరసన వ్యక్తం చేస్తున్న ఆశవర్కర్లు